క్లుప్తంగా

నవాబుపేటలో హోం ఓటింగ్

నవాబుపేట: మండలంలో సోమవారం సీనియర్ సిటిజన్ల హోం ఓటింగ్ ప్రారంభించినట్లు ఆర్‌ఐ కిరణ్ తెలిపారు. యన్మన్‌గండ్ల, పోమాల్, నవాబుపేట, కొల్లూర్, చౌడూర్ గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కాగా పలువురు వినియోగించుకున్నట్లు వివరించారు.

అధ్యక్షుడిగా నరేంద్రకుమార్ శర్మ

జడ్చర్ల: బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా బాదేపల్లి రంజిత్‌బాబు, అధ్యక్షుడిగా నరేంద్ర కుమార్ శర్మ, ఉపాధ్యక్షులుగా పరుషోత్తంరావు, రాఘవేంద్రశర్మ, భగవాన్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా వి. రాఘవేంద్రశర్మ, కోశాధికారిగా అంబిరాంచంద్రన్, ధార్మిక కార్యదర్శిగా సుమన్ శర్మ, సహాయ కార్యదర్శిగా భాస్కర్‌రావులు ఎన్నికయ్యారు. సమావేశంలో నర్సింహ్మారావు, రమాకాంత్, దత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలు కొనసాగించాలి

చిన్నచింతకుంట: చిన్నయ్య, రాందాస్‌ల ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకుడు జేఎస్ దేవదానం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వర్ధంతి నిర్వహించారు. స్థూపానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అరుణ్‌కుమార్, సాంబశివుడు, కోళ్ల వెంకటన్న, వెంకటేష్‌గౌడ్, యం. నర్సింహ, అడివన్న, యం. ప్రవీణ్, శారద, కే. చంద్రన్నల పాల్గొన్నారు.

కమిటీ ఏర్పాటు

అడ్డాకుల: పొన్నకల్‌లో సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మునగల హనుమంతు ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కొమ్ము ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా అంజన్న, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా దోమ శేఖర్, సలహాదారులుగా శివన్న, ఎల్లన్న, వెంకటయ్య, కొండన్న, దాసు, బుచ్చన్న ఎంపికయ్యారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాలనర్సిములు, బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తెలుగు భాషను ఆదరించాలి



మహమ్మదాబాద్: తెలుగు భాషను ఎప్పటికీ ఆధరించాలని ఆర్యసమాజ్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రావు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఏపూరి కిష్టప్ప రచించిన 'తీర్థములు' పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రిటైర్డ్ జీహెచ్ఎం కృష్ణారెడ్డి, అరవిందం కుమార్, నాగిరెడ్డి, అంజిలయ్యగౌడ్, బాగన్నగౌడ్, శ్రీనివాస్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



కె. సుభాషిణి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కె. సుభాషిణికి చత్తీస్‌ఘడ్ కళింగ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. జంతుశాస్త్రంలో డా. అజయ్‌కుమార్ హరిత్ పర్యవేక్షణలో ఆమె పలు అంశాలపై పరిశోధన చేసిన నేపథ్యంలో డాక్టరేట్ వరించింది. కాగా సుభాషిణిని ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, అధ్యాపకబృందం సోమవారం అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి కింగ్ షోటోకాన్ కరాటే దూ ఇండియా విద్యార్థి అర్ష్ జమీల్.. ఈనెల 8 నుంచి 12 వరకు డెహ్రాడూన్‌లో జరిగే కరాటే దూ ఇండియా ఆర్గనైజేషన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. మార్చి 3న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడంతో జాతీయస్థాయిలో అవకాశం వచ్చిందని వివరించారు. కాగా సోమవారం జిల్లా కేంద్రంలో అర్ష్ జమీల్‌ను ఘనంగా సన్మానించారు. కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

మరికల్: యోగతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీవాణి పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లశర్మ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వేసవి యోగ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు యోగలో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం సమయంలో విద్యార్థులకు యోగలో వివిధ ఆసనాలను నేర్పిస్తామన్నారు.

నిలువ నీడ కరువు..

- ఎండలోనే బస్సులకోసం పడిగాపులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



సిగ్నల్‌గడ్డ వద్ద బస్సుకోసం ఎండలోనే వేచి ఉన్న ప్రయాణికులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలో ప్రధాన రోడ్లపై బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. రోడ్డు విస్తరణ పేరుతో ఉన్న భారీ వృక్షాలను సైతం తొలగించటం, ఆయా సంస్థలు, దాతలు నిర్మించిన బస్‌షెల్టర్లు కూల్చివేయటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దీంతో తమ కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. మండుటెండలోనే రోడ్డుపై నిల్చుని వేచిచూడాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. తప్పని సరి పరిస్థితిలో ఫ్లెక్సీల చాటున, చిరు వ్యాపారులు వేసుకునే టెంట్ల కింద నిలబడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటి పరిధిలో ప్రధానంగా సిగ్నల్‌గడ్డపై రైల్వేబ్రిడ్జ్‌కు ఇరువైపులా నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు అటూ మహబూబ్‌నగర్, హైదరాబాద్, కల్వకుర్తి ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇక నేతాజీ చౌరస్తాలో నాగర్‌కర్నూలు, కొల్లాపూర్, వనపర్తి ప్రాంతాలకు వెళ్లే వారుంటారు. జడ్చర్ల క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు రోడ్డుపై వేచి చూస్తుంటారు. బాదేపల్లి గాంధీ చౌరస్తాలోనూ ప్రయాణికులు ఆటోల కోసం వేచి ఉంటారు. వీరంతా ఎండలోనే నిల్చోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణ పేరుతో బస్‌షెల్టర్లను కూల్చివేయటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. క్రాస్‌రోడ్డు వద్ద, నేతాజీచౌరస్తా, గాంధీచౌక్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది.

నాటి చలువ పందిళ్లు ఏవి?

ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా మూడేళ్లక్రితం మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేయించింది. గ్రీన్ నెట్‌ను ఏర్పాటు చేసి ఎండవేడి నుంచి ప్రయాణికులకు ఉపశమనం కల్పించింది. కాని ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేని నేపథ్యంలో.. గతంలో మాదిరిగా చర్యలు చేపట్టి తమకు ఉపశమనం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ ఎస్.రాజయ్యను సంప్రదించగా ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని వివరించారు. ఆదేశాలు అందితే గ్రీన్‌నెట్‌లు వేయటానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి మున్సిపాలిటీ పరిధిలో ప్రయాణికులు నిల్చునే చోట చలువ పందిళ్లు వేయించాలని, అదేవిధంగా చలివేంద్రాలు సైతం ఏర్పాటు చేయించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పండ్ల బండి వద్ద తలదాచుకుంటున్న ప్రయాణికులు



ఎండకు తాళలేక ఫ్లెక్సీచాటున..

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. సోమవారం రామస్వామిగుట్ట తండా, ఎక్వాయపల్లి, పెద్దాదిరాల, కొండేడు, కోడ్గల్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థ రహితమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం మరిచి ప్రజలపై అప్పుల కుప్ప పెట్టిపోయిందని, తాము అధికారంలోకి వచ్చాక దశల వారిగా అభివృద్ధికి, సంక్షేమానికి పాటు పడుతున్నామని తెలిపారు. ఈసందర్భంగా వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఎంపీపీ నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి కడుపు నింపే పార్టీ కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: పేదవాడి కడుపు నింపే పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్లీపూర్, ధర్మాపూర్, జమిస్తాపూర్, బొక్కలోనిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భద్రాచలం రాముల వారి సన్నిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించారని, కానీ ఎన్నికల కోడ్ వల్ల మనకు కాస్త ఆలస్యమైందని.. ముగిసిన వెంటనే పథకం అమలు చేస్తామని అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందన్నారు. సంవత్సరానికి 4వేల ఇందిరమ్మ ఇళ్లు పాలమూరుకు వస్తాయన్నారు. ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే.. ఆ గెలుపు పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి గౌరవాన్ని నలుదిశలా పెంచుతుందని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మేఘారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికలలో భాగంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రాత్రి పాల్కొండ, దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి, కోయనగర్, సత్యమన్నకాలనీ, హనుమాన్ తండా, బీసీకాలనీ తదితర చోట్ల ప్రచారం నిర్వహించారు.

అందరి నోటా బీజేపీ మాటే..



కొల్లూర్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీకే అరుణ

నవాబుపేట: ప్రజలందరి నోటా బీజేపీని గెలిపించాలనే మాటే వినవస్తోందని.. గెలుపు తధ్యమని ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొల్లూర్, చౌడూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు.. జిల్లా నాయకుడు అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో డీకే అరుణ సమక్షాన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాటాడారు. ప్రతి పల్లెలో బీజేపీకి ఆదరణ పెరుగుతుందని.. దేశంలో మోదీ మూడోసారి అధికారంలోకి రావటం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, రఘు, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలి



ప్రచారం చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

నవాబుపేట: ఎన్నికల నేపథ్యంలో సోమవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి తరుపున ఆయన సతీమణి గీతారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. మండలపరిధిలోని రుద్రారం, కాకర్లపహాడ్ తదితర గ్రామాల్లో ఈ సందర్భంగా పర్యటించారు.

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం జైనల్లీపూర్, ఫతేపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు పి.రవీందర్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. రాజేశ్వర్, గోవర్ధన్‌రెడ్డి, సాబేర్, కేశవులు తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



జితేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మక్తల్: కుర్వ కులస్తులకు ఆరాధ్యదైవమైన బీరప్ప ఉత్సవాలను మండలంలోని గుడిగండ్లలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుర్వకులస్తులు శరీరంపై పసుపు చల్లుకుంటే తమకు సుఖసంతోషాలు కలుగుతాయని ఇంట్లో అన్ని శుభాలు జరుగుతాయని నమ్మకం. దీంతో ఐదేళ్లకు ఒకసారి ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లో దాదాపు 40వేలు మంది భక్తులు హాజరయ్యారు. నూతన వస్త్రాలు ధరించి పసుపు బండారును చల్లుకునేందుకు పోటీపడ్డారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, తదితరులు కార్యక్రమం ప్రారంభించి బండారు చల్లి ఆశీర్వదించారు.

నేడు చండీ హోమం

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలోని శ్రీ గిరిఅష్టలక్ష్మి ఆలయంలో అమావాస్య పురస్కరించుకుని మంగళవారం చండీ హోమం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ నిర్వహకులు ఆచార్య కృష్ణస్వామి సోమవారం వివరాలు తెలిపారు. అమావాస్య మంగళ, బుధ రెండు రోజుల్లో ఉందని.. అయితే మొదటిరోజున ఉదయం 10.30గంటలకు ప్రారంభం అయి పూర్తిగా ఉంటుందన్నారు. బుధవారం ఉదయం 9గంటలకే వెళ్లిపోతున్నందున చండీహోమం మొదటిరోజునే చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మంగళవారం రోజు మహాప్రదోషం బాగా ఉందని, బుధవారం కేవలం చుక్క అమావాస్య మాత్రమే ఉందని తెలిపారు. భక్తులు గమనించి చండీహోమానికి మంగళవారమే హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి



చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బండ్రపల్లి, పర్దిపూరం, నెల్లికొండి, ఉంద్యాల, చిన్నచింతకుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తరిమి కొట్టాలన్నారు. బీఆర్‌ఎస్‌ను ఆదరించి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వరి, మండల అధ్యక్షుడు కోట రాము, నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మాతృశ్రీ ఈశ్వరాంబ డేను పురస్కరించుకుని ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. సోమవారం తెల్లవారు జామున అమ్మవారి చిత్రపటంతో పట్టణ పురవీధుల గుండా నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, భక్తిపాటలను ఆలపించారు. సాయి మహిమలు, ఆయన చేసిన సేవలను కొనియాడారు. బాబాకు తల్లి ప్రోత్సాహాన్ని వివరించారు.

బాలలరక్షణపై అవగాహన



మక్తల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు మహిళా సాధికారత ఆధ్వర్యంలో బాలలరక్షణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీహెచ్‌ఈడబ్ల్యూ సభ్యులు అనిత, రేణుక మాట్లాడుతూ బాలల సంబంధించిన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో కృష్ణ, మారెప్ప, యాదయ్య, మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా..



చిన్నరాజమూర్‌లో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర మండలం చిన్నరాజమూర్, కోయిల్‌సాగర్, అడవి అజిలాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజల సంక్షేమం విస్మరించిందని అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. దేశంలో సమన్యాయం రావాలంటే కాంగ్రెస్ గెలవాలని అన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భూత్పూర్: మున్సిపల్ వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాస్ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సమక్షంలో సోమవారం సొంత గూటికి చేరారు. పట్టణంలో అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ అధ్యక్షతన కార్యక్రమంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా డా. పాష, వెంకటేష్, 200 మందికి పైగా అమిస్తాపూర్, నల్లగుట్టతండా, రాందాస్ తండాలకు చెందిన వారు, కప్పెట మాజీ సర్పంచ్ వేణుగోపాల్, గోపన్నపల్లి మాజీ సర్పంచ్ హర్యానాయక్, కిష్టయ్య ఆధ్వర్యంలో.. ముసాపేట, అడ్డాకుల మండలాలకు పలువురు పార్టీలో చేరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, గోవర్ధన్ గౌడ్, విజయ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, రామన్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్సింహులు తదితరులు ఉన్నారు.

చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లా వంశీచంద్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని ఈ సందర్భంగా అర్చన చేయించారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: బీజేపీ తీసువచ్చిన నల్ల చట్టాల రద్దుకు రాహుల్ గాంధీ రైతుల పక్షాన పోరాడి విజయం సాధించారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పగిడ్యాల్, ఆశిరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, గండేడ్ గ్రామాల్లో ప్రచారం చేశారు. బీజేపీ పదేళ్లలో చేసిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ సైతం అదే బాటలో పయనించిందని విమర్శించారు. కాగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల తర్వాత అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే అభివృద్ధికి మరింత అవకాశం ఉందని పేర్కొన్నారు. అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ నర్సింహరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి, ప్రధానకార్యదర్శి పుల్లారెడ్డి, మహమ్మదాబాద్ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి



దమగ్నపురంలో ఓటు అభ్యర్థిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దమగ్నపురంలో ఎమ్మెల్యే సతీమణి కవితతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: కాంగ్రెస్ ఆదివాసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెల్లయ్య నాయక్ సోమవారం తిరుమలగిరిలో ప్రచారం చేశారు. జిల్లా అధ్యక్షుడు లింగం నాయక్, ఆదిరమణారెడ్డి, బద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: డీసీసీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు మంగంపేట్, నంచర్ల, అన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పవన్‌కుమార్, పత్తి గోపాల్, నాగయ్య, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరాఫరాకు అంతరాయం



పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

దేవరకద్ర: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో లీకేజీల కారణంగా తరచు నీటి సరాఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. వేసవి వల్ల నీటి సరాఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. గత వారం రాయిచూర్ రోడ్డు పక్కన ఓ ఇంటి యజమాని జేసీబీతో తవ్వడంతో ప్రధాన పైపులైన్ పగిలి పోయి మూడు రోజుల పాటు నీటి సరాఫరా నిలిచి పోయింది. మళ్లీ సోమవారం లీకేజీ పనుల కోసం నీటి సరాఫరాను నిలిపి వేశారు. దీని వల్ల కొత్త బస్టాండ్ ప్రాంత ప్రజలు నీటి ఇబ్బందులను తరచు ఎదుర్కొవలసి వస్తున్నది. లీకేసీ పనులు సోమవారం సాయంత్రం పూర్తి కావడంతో మంగళవారం ఉదయం నీటి సరాఫరా చేస్తామని అధికారులు తెలిపారు.

సమస్యను వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దూమర్ల నిరంజన్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర వ్యాప్తంగా వ్యాయామ ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఉన్నతీకరణ అంశాన్ని పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ముగిసిన వెంటనే పరిష్కరించాలని... తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (టీజీపెటా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్ కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టెట్‌కు సంబంధించి జాతీయ ఉపాధ్యాయ మండలి పంపిన పూర్తిస్థాయి వివరణను రాష్ట్ర పాఠశాల విద్యాకమిషనర్ వెల్లడి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక అనుమతి తీసుకొని మంజూరు చేయాలని, ఎన్నికలు ముగిసిన వెంటనే అన్ని క్యాడర్ల పదోన్నతులు చేపట్టాలని కోరారు. సంఘం సలహాదారులు సూర్యప్రకాశ్, కోశాధికారి మొగులాల్, సభ్యులు ఆనంద్‌కుమార్, శంకర్‌నాయక్, సుచేతన్‌రెడ్డి, రాములు, మొయిన్, శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా షీటీం



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీదేవి

నారాయణపేట రూరల్: మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయం గుర్తుంచుకోవాలని షీటీం జిల్లా ఇన్‌చార్జి, ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్‌నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతో పాటు మగపిల్లల్లోను మార్పు రావాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. షీటీమ్ సభ్యులు బాలరాజు, నమీనా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మండుటెండలో.. ఉపాధి పనులు

భానుడి భగ భగలతో ఉష్ణోగ్రత 47 డిగ్రీలకు చేరుకున్న తరుణంలో.. ఆ ఎండను సైతం లెక్కచేయకుండా సోమవారం ఉపాధి కూలీలు మల్లెల పాపయ్య కుంటలో పనులు చేపట్టారు. కాగా రెండు నెలలుగా కుంటలో షీల్టు తీసే పనులు కొనసాగుతున్నాయి. రోజు దాదాపు వందమంది వరకు కూలీలు మట్టిని తీసే పనుల్లో పాల్గొంటున్నారు. వేసవి నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి పనులు మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు చేయాల్సి ఉండగా... ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో తాళలేక 11 గంటల వరకే కూలీలు వెళ్లిపోతున్నారు.

– దేవరకద్ర